కావలెను

అనుభవజ్ఞులైన జర్నలిస్టుల సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల నుండి వెలువడుతూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన ప్రజానేత్రం దినపత్రికలో పనిచేయుటకు జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అనుభవజ్ఞులకు, కొత్తవారికి అవకాశం కల్పించబడును

సంప్రదించండి ప్రజానేత్రం యాజమాన్యం 9441665588

ప్రజానేత్రం తెలుగు దినపత్రిక

ప్రజానేత్రం

తెలుగు దినపత్రిక

తెలంగాణ/నల్గొండ | సంపుటి: 6 | సంచిక: 134 | శుక్రవారం 6-11-2026 | పేజీలు: 4 వెల: రూ. 1.00

Published from: Nalgonda, Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Adilabad, Amaravati, Chittur, Vijayawada



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

– మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి మంత్రివర్గం ఆమోదం

-నవంబర్ 20 నుంచి 30 వరకు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ

-2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు

-నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ జయంతి సభ.. చీరల పంపిణీ ప్రారంభం

-ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు.. అగ్నిమాపక చట్ట సవరణకు ఆమోదం



హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించాలని రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించింది. ఈ పథకం అమలులో భాగంగా నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో లబ్ధిదారుల ఇళ్లలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశ వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరితో కలిసి మీడియాకు వెల్లడించారు.

- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు

రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి పండుగను ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల్లో పాల్గొననున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి పండుగ వేడుకలు జరుపుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వం నిర్మించిన ఇళ్లలో లబ్ధిదారులు సంతోషంగా దీపావళి జరుపుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

- ఇందిరమ్మ జయంతికి భారీ సభ

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయించింది. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడంతోపాటు మహిళలకు చీరల పంపిణీ చేపట్టనున్నారు.

- ప్రతి కుటుంబానికి జీవిత బీమా

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా సౌకర్యం అందించనున్నారు. ఇందుకోసం నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు.

- ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు

ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి, రెండు వర్గాలకు ప్రత్యేక కమిషన్లు ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ఇందుకు సంబంధించి 2003 నాటి తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చట్టాన్ని రద్దు చేసేందుకు ఆమోదం తెలిపింది. కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి కమిషన్‌లో ఒక చైర్మన్‌తోపాటు ఐదుగురు సభ్యులు ఉంటారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడంతోపాటు ఆయా వర్గాల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని మంత్రివర్గం అభిప్రాయపడింది.

- అగ్నిమాపక చట్టానికి సవరణ

తెలంగాణ అగ్నిమాపక సేవల చట్టం–1999కు సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రమాదాలకు గల కారణాలను గుర్తించడం, వాటిపై వేగంగా స్పందించేలా చర్యలు తీసుకోవడం ఈ సవరణల ప్రధాన ఉద్దేశం. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల యజమానులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అగ్నిమాపక శాఖ చేపట్టాల్సిన చర్యలను కొత్త నిబంధనల్లో పొందుపరచనున్నారు. అగ్ని ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ఈ మార్పులు ఉపయోగపడనున్నాయి.

2లో..

ప్రధానికి అధికారికంగా

లేఖ రాయండి

– రాహుల్‌కు అమిత్ షా సవాల్

- ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చకు రెడీ

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేస్తాం

- రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరిగితే సరిపోదు

- ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలి



న్యూఢిల్లీ ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ చర్చకు రావాలంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. నిజంగానే చర్చించాలనే చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

- రాజ్యాంగ పుస్తకం పట్టుకుంటే సరిపోదు

హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హఠావో' యాత్రలో అమిత్ షా ప్రసంగించారు. పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే ప్రయోజనం లేదని, ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా వాకౌట్లు చేయడం,

2లో..

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

– ప్రజాతీర్పు తారుమారుకు కుట్రలన్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శించింది. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును సైతం గౌరవించకుండా, తమకు అనుకూలంగా ఫలితాలను మార్చుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో గోకుల్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న పరిణామాలే ఇందుకు నిదర్శనమని దుయ్యబట్టింది. ఎన్నికలు పూర్తయి ఫలితాలు వెలువడిన తర్వాత, పాలకవర్గంలో మెజారిటీని సాధించేందుకు నిబంధనలను మార్చాలని మహాయుతి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ మేరకు గురువారం తన సామాజిక మాధ్యమ ఖాతాలో స్పందించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా చేసిన విమర్శలను కూడా తన పోస్టుకు జత చేశారు.ఒక ఎన్నిక

2లో..

తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ దందా



హైదరాబాద్ తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని

2లో..

మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు

– ఆసియా గేమ్స్ పారా అథ్లెట్లపై ప్రధాని మోదీ ప్రశంసలు



న్యూఢిల్లీ జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్ 2026లో భారత పారా అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పారా గేమ్స్‌లో మన అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శన, ప్రపంచ క్రీడల్లో భారతదేశం ఒక ప్రధాన శక్తిగా ఎదుగుతోందనడానికి ఒక నిదర్శనమని కొనియాడారు. 2010లో ఒక స్వర్ణంతో సహా 14 పతకాలను సాధించిన భారత్, ఈ ఏడాది ఏకంగా 114 పతకాలను సాధించిందని, ఈ ఘనతకు అథ్లెట్ల అంకితభావం, బలపడిన క్రీడా వ్యవస్థే కారణమని చెప్పారు. గురువారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా అథ్లెట్లతో కలిసి మోదీ ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. పారా గేమ్స్‌లో మహిళా అథ్లెట్ల చూపిన అద్భుత ప్రదర్శన గురించి ప్రధాని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. భారత్ నుంచి బరిలోకి దిగిన 56 మంది మహిళా అథ్లెట్లలో 34 మంది పతకాలు గెలుచుకున్నారని కొనియాడారు. అలాగే, క్రీడలకు రెండు నెలల ముందు మరణించిన తన తల్లికి జావెలిన్ త్రోయర్ రింకు తన బంగారు పతకాన్ని అంకితం చేస్తూ భావోద్వేగానికి గురైన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు. "ఆసియా పారా గేమ్స్‌కు కేవలం రెండు నెలల ముందు రింకు తన తల్లిని కోల్పోయారు. అంతటి తీవ్రమైన దుఃఖంలో కూడా ఆయన ధైర్యం కోల్పోకుండా, స్వర్ణ పతకం గెలిచినప్పుడు తన తల్లి ఫొటోను చేతిలోకి

2లో..

బస్సు కదలాలంటే డోరు మూయాల్సిందే

– ప్రవళిక మృతితో ఆర్టీసీ కీలక నిర్ణయం

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులు, సిబ్బంది భద్రత విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి ఘటన నేపథ్యంలో కదులుతున్న బస్సుల్లో డోర్లు తప్పనిసరిగా మూసి ఉంచాలని ఆదేశించింది. ఈ మేరకు ఆర్టీసీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అన్ని డిప్యూటీ రీజినల్ మేనేజర్లకు సూచనలు జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్టోబర్ 25న జరిగిన విషాద ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన 24 ఏళ్ల కండక్టర్ గుండ్ల ప్రవళిక మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న పల్లెవెలుగు బస్సులో విధులు నిర్వహిస్తున్నారు. అశ్వాపురం మండలం మిట్టగూడెం సమీపంలో ప్రయాణికురాలు బానోత్ మౌనికతో టికెట్ విషయంలో వాగ్వాదం జరిగింది. రూ.100నోటుకు చిల్లర తిరిగి ఇచ్చే విషయంలోనూ వివాదం తలెత్తినట్లు సమాచారం.ఈ క్రమంలో కదులుతున్న బస్సు నుంచి ప్రవళికను బయటకు తోసేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆమె తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ప్రవళిక మృతి చెందారు. ఈ ఘటన ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులను షాక్ కు గురి చేసింది. దీంతో భద్రతా చర్యలు మరింత కఠినం చేయాలని



డిమాండ్ తెరమీదకు వచ్చింది. ఇప్పుడు తెలంగాణ ఆర్టీసీ ప్యాసింజర్ డోర్లు ఉన్న అన్ని బస్సుల్లో ప్రయాణ సమయంలో తలుపులు తప్పనిసరిగా మూసి ఉంచాలని


2లో..

ముగిసిన 'పరిషత్' ఎన్నికల పోలింగ్

- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా సాగిన ప్రక్రియ

- ప్రాథమిక అంచనాల ప్రకారం 65-68% పోలింగ్ నమోదు

- నవంబర్ 7న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి



అమరావతి ఆంధ్రప్రదేశ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమరం ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఐదు గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 582 జడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు ఈ ఓటింగ్ జరిగింది. ఉదయం నుంచి వాతావరణం అనుకూలించక పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, మధ్యాహ్నం వరకు నెమ్మదించిన ఓటింగ్ శాతం తర్వాత ఊపందుకున్నాయి. సాయంత్రం 5 గంటలకు అధికారిక ప్రకటన వెలువడే సమయానికి గ్రామీణ ఏపీ వ్యాప్తంగా సుమారు 65% నుంచి 68% మధ్య పోలింగ్ నమోదై ఉంటుందని ప్రాథమిక సమాచారం ఆధారంగా అంచనా వేస్తున్నారు. ఉదయం 11 గంటల సమయానికి 21.12% గా ఉన్న పోలింగ్ శాతం, మధ్యాహ్నం 1 గంట దాటేసరికి 35% నుండి 50% వరకు పెరిగింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గ్రామీణ ఓటర్లు బూత్‌ల వైపు అడుగులు వేశారు. ముఖ్యంగా రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలైన మార్కాపురం ,

2లో..

ప్రజానేత్రం తెలుగు దినపత్రిక PRAJA NETRAM Telugu Daily శుక్రవారం 6,నవంబర్ 2026

ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలి

- బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్





ఎల్బీనగర్, ప్రజానేత్రం, నవంబర్ 05: ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ బొంగు వెంకటేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పాదయాత్ర నిర్వహించారు. మన్సూరాబాద్ డివిజన్ నుంచి ఆటోనగర్ డంపింగ్ యార్డ్ వరకు నిర్వహించిన ఈ పాదయాత్రలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్‌కు చేరుకున్న నాయకులు అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. చెత్త నిల్వలు, వ్యర్థ పదార్థాల అస్తవ్యస్త నిర్వహణ, తీవ్ర దుర్వాసన, వెలువడుతున్న పొగ, గాలి, నీటి కాలుష్యం వల్ల స్థానికులకు కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బొంగు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, "ఆటోనగర్ డంపింగ్ యార్డ్ కారణంగా మన్సూరాబాద్ డివిజన్‌లోని పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసన, విషపూరిత పొగ, గాలి, నీటి కాలుష్యం వల్ల ప్రజల జీవనం అస్తవ్యస్తమైంది. చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదు" అని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్‌పై సమగ్ర విచారణ చేపట్టి, గాలి, నీటి నాణ్యతను పరీక్షించాలని, పర్యావరణ నిబంధనలు పాటిస్తున్నారో లేదో తేల్చాలని కోరారు. "ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను పూర్తిస్థాయిలో తరలించే వరకు బీసీ పీపుల్స్ ఫెడరేషన్ పోరాటం ఆగదు. అవసరమైతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం" అని బొంగు వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జలమోని రవీందర్ ముదిరాజ్, కొంగరి కృష్ణ, బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షులు కే. గాంధీ నాయక్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు చిప్పలపల్లి యాదగిరి, తెలుగు యువత రాష్ట్ర నాయకులు నకిరేకంటి శ్రీకాంత్, చిప్పలపల్లి నరేందర్, చిప్పలపల్లి సురేష్, చేగూరి పరమేష్, జై భారత్ జాతీయ ఉపాధ్యక్షులు ఖదిజ్ఞాసి వంశీ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి రాజు, సామాజిక విప్లవ రణభేరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సైదయ్య, హైకోర్టు న్యాయవాది ఖదిజ్ఞాసి గణేష్ గల్లా, జై భారత్ ఎస్సీ పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఖదిజ్ఞాసి మధు మాదిగ, నాయకులు పాండు, గురువయ్య, శ్రీనివాస్ పిట్ల తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడులు రాజ్యాంగ విరుద్ధం

- ఓటు హక్కు ఉద్యోగించుకున్న అనంతరం మీడియాతో శైలజా చరణ్ రెడ్డి



ఐరాల, ప్రజానేత్రం, నవంబర్ 05: వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు శైలజా చరణ్ రెడ్డి గురువారం ఐరాల మండలం కాణిపాకం పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ పాత్రికేయులపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. "పాత్రికేయులపై దాడులు, అఘాయిత్యాలు రాజ్యాంగ విరుద్ధం. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియాకు తగిన గౌరవం ఇవ్వాలి. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదు" అని ఆమె హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని పిలుపు నిచ్చారు.

రేపటి నుండి అర్వపల్లి దర్గా ఉత్సవాలు

- రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిగా తరలి రామన్న భక్తులు

అర్వపల్లి : మత సామరస్యానికి ప్రతికగా నిలిచే అర్వపల్లి శివారులో కొలువైన హజ్రత్ సయ్యద్ ఖాజా నసిరుద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు రేపు ప్రారంభం కానున్నాయి. రెండు రోజులపాటు అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి. ఈ ఉర్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వేలాది భక్తులు తరలిరానున్నారు. వక్స్ బోర్డు, జిల్లా అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో పూజలు చేసి గంధాన్ని అత్యంత వైభవంగా భక్తుల నడుమ దర్గాకు తీసుకురానున్నారు. అనంతరం అర్ధరాత్రి ఖావ్వాలి నిర్వహిస్తారు. 7వ తేది శనివారం బాబా సన్నిధిలో భక్తిశ్రద్ధలతో చిరాగ్ కార్యక్రమం జరుగుతుంది. ఈ ఉర్సుకు ముస్లింలతో పాటు హిందువులు కూడా హాజరై బాబాని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. జాతీయ రహదారి నుండి దర్గాకి వెళ్లే దారి గుంతలు పడి ఉండడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఉర్సుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు వక్స్ బోర్డు రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ అమీర్ అహ్మద్, జిల్లా ఇన్‌స్పెక్టర్ దస్తగిరి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్ఐలు, వంద పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



కమాన్ పూర్, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది అని బి ఆర్ ఎస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికొండ శంకర్ అన్నారు. గురువారం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎంపీడీవో మరియు తహసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు.కమాన్ పూర్ మండల పరిధిలో వరి పంటలు కోతల సమయం వచ్చినప్పటికి దాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గురువారం బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా ప్రభుత్వ మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని త్వరితగతిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల విక్రయ ఇబ్బందులు తొలిగించాలని కోరుతూ.. తహసీల్దార్ వాసంతికీ, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మండలంలో వరి కోతలు జరుగుతున్నప్పటికి కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దాన్యం విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మధ్య దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకుందన్నారు. ప్రక్కన పెద్దపల్లి నియోజకవర్గంలో గత వారం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని కమాన్ పూర్ మండలంలో ఇప్పటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా మండలం పరిధిలో సెర్ప్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేని యెడల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేయట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, చిందం తిరుపతి, రాచకొండ రవి, నీలం శ్రీనివాస్, జాబు సతీష్, , రాచకొండ చంద్రమౌళి, పెండ్లి నారాయణ, పొట్ల సతీష్, కొయ్యడ సంపత్, పంతకాని రవి, నడిగొట్టు సంపత్, పొట్ల శంకర్, కొండిల్ల ఓదెలు, గుర్రం శంకర్, ఒడ్నాల సతీష్, షేక్ మొహినుద్దీన్, దండే రమేష్ ఠాగూర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామ పంచాయతీగా "ఇల్లూరు" ఎంపిక..

- పీఎం ఏ జె ఏ వై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద ఆదర్శ గ్రామపంచాయతీగా ఇల్లూరు సెలెక్ట్

- కులమత రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్న సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి..

- ఇల్లూరు ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం పట్ల కృషి చేసిన కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత

- రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికి కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్

మధిర మండలంలో నెంబర్ వన్ గ్రామంగా ఇల్లూరు ను ఎంపిక చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచి గ్రామ ప్రజలు.కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా గ్రామాల్లోని జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పారిశుధ్య కార్యక్రమాలు ఇతర వాటిలి పరిగణలోకి తీసుకొని గ్రామపంచాయతీలను పీఎం ఏ జె ఏ వై ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ద ఆదర్శ గ్రామపంచాయతీలను ఎంపిక చేయటం జరిగింది దానిలో భాగంగా మధిర మండలం నుండి ఇల్లూరు గ్రామం ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ గ్రామంలోని కులమత రాజకీయాలకు అతీతంగా ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని భవిష్యత్తులో కూడా అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేపట్టి ఆదర్శ గ్రామంగా ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం పట్ల కేంద్ర మాజీ మంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు సహకరించిన జిల్లా, మండల అధికారులకు సర్పంచి చేకూరి ఆదిలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యసేవలో ఆటంకాలు లేకుండా సేవలు అందించాలి

- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

మంచిర్యాల : జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్‌హెచ్ఎం ఎం వైద్య సిబ్బంది ధర్నాలో ఉన్నందున వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మంచి ర్యాల జిల్లా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆదేశించారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న ఆరోగ్య కార్యకర్తలు సిబ్బందితో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించడం, నమోదు చేయడం, నిశ్చయ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్టులను అందజేయాలన్నారు. మాతా శిశు సంరక్షణ, గర్భవతుల నమోదు, ఆసుపత్రిలో ప్రసవాలు, అమ్మఒడి అంబులెన్స్ సర్వీస్ లను ఉపయోగించుకొనుట, కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటివి ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ సర్పంచులు, సిబ్బంది పరిశుభ్రతపై, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలోజిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ, సీహెచ్వో జయమేరీ, పర్యవేక్షకులు రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ ధాటికి కొట్టుకుపోయిన లో లెవల్ చప్టా

- వంతెన నిర్మాణం చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

- రూ.1.60 కోట్లు మంజూరు చేసినా ప్రారంభానికి నోచుకోని పనులు

ములకలపల్లి : ములకలపల్లి మండల పరిధిలోని పూసుగూడెం వీకే రామవరం మధ్య ఉన్న లో లెవల్ చప్టా మురసు తుఫాన్ ప్రభావంతో వచ్చిన వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో గురువారం బీఆర్ఎస్ నాయకులు, స్థానిక సర్పంచ్ గుగులోత్ ధర్మా, తాటి రవి చప్టాను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూసుగూడెం నుండి వీకే రామవరం, సంజీవపల్లి, కొత్తూరు తదితర గ్రామాల మీదుగా బూర్గంపాడు వెళ్లే ప్రధాన రహదారిపై ఈ చప్టా ఉందని తెలిపారు. వర్షాకాలంలో కొద్దిపాటి వర్షాలకే చప్టాపై నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 2024లో ప్రభుత్వం హై లెవల్ వంతెన నిర్మాణానికి రూ. 1.60 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందని, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా శంకుస్థాపన కూడా నిర్వహించారని గుర్తుచేశారు.దీంతో తమ కష్టాలు తీరుతాయని భావించిన గ్రామస్తులకు నిరాశే మిగిలిందన్నారు. శంకుస్థాపన జరిగి ఇంతకాలం గడుస్తున్నా వంతెన నిర్మాణ పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదని విమర్శించారు. బుధవారం కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతి పెరిగి చప్టా పూర్తిగా కొట్టుకుపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హై లెవల్ వంతెన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.

బస్సు కదలాలంటే డోరు మూయాల్సిందే

స్పష్టం చేసింది. డోర్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలని, లోపాలుంటే వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించింది. బస్సులు ప్రయాణంలో ఉన్నప్పుడు తలుపులు తెరిచి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని యాజమాన్యం నిర్ణయించింది. క్షేత్రస్థాయి అధికారులు ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. బస్సు తలుపులు సరిగా పనిచేస్తున్నాయా, ప్రయాణ సమయంలో మూసి ఉన్నాయా అనే అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది భద్రతకు మరింత ప్రాధాన్యత ఇస్తుందని అధికారులు భావిస్తున్నారు. గతంలోనూ బస్సుల్లో డోర్స్ తెరిచి ఉంచడం వల్ల ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు కఠిన నిబంధనలు అమలు చేయడం వల్ల ఇలాంటి విషాదాలు తగ్గే అవకాశం ఉంది.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా

- సర్వే అప్పీళ్ల గడువు కుదింపు

తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం-1923లోని 12(ఏ) సెక్షన్‌కు సవరణ చేసే ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సర్వే, సరిహద్దులకు సంబంధించి జారీ చేసే నోటీసులపై అప్పీల్ చేసుకునేందుకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గడువును 30 రోజులకు తగ్గించాలని నిర్ణయించింది. ఈ మేరకు చట్ట సవరణ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది.

ప్రధానికి అధికారికంగా లేఖ రాయండి

ఆందోళనలకు దిగడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని విమర్శించారు.మృతుల పేర్లతో పాటు మూడు కోట్ల మంది బంగ్లాదేశ్ చొరబాటుదారులు, రోహింగ్యాల బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు అభ్యంతరమని అమిత్ షా ప్రశ్నించారు. చొరబాటుదారులే కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారని, అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను అడ్డుకునేందుకు 'ఓట్ల చోరీ' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని, చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తప్పనిసరిగా తొలగించాలని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ చర్చలకు అత్యున్నత వేదిక అని అమిత్ షా పేర్కొన్నారు. అలాంటి వేదికలో కీలక అంశాలపై చర్చించకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వకుండా బయట వీధుల్లో ఆందోళనలు చేస్తూ అరాచకాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. 80 ఏళ్ల ప్రజాస్వామ్యం తమ మోసాలకు లొంగిపోతుందని కాంగ్రెస్ భావిస్తోందా అని ప్రశ్నించారు. పార్లమెంట్, శాసనసభలు, గ్రామాలు, పొలాల్లోనూ బీజేపీ కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజలను సమీకరించి ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ భావిస్తే, వాటిని ఎదుర్కొనేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని తొలగించండి' యాత్ర రాహుల్ గాంధీకి బలమైన సమాధానమని అమిత్ షా పేర్కొన్నారు.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

పూర్తయిన తర్వాత, వెలువడిన ఫలితం నచ్చలేదనే కారణంతో ప్రభుత్వం నిబంధనలను ఎలా మార్చుతుందని పవన్ ఖేరా ప్రశ్నించారు. ఎన్నికైన పాలకవర్గం సజావుగా పనిచేయకుండా అడ్డుకునేందుకు మహారాష్ట్ర మంత్రిమండలి బుధవారం కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని ఆరోపించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను మినహాయించి, రూ.500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగిన సహకార సంస్థల నిర్వహణ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించాలని నిర్ణయించిందని వెల్లడించారు. వీరిలో నలుగురికి ఓటు హక్కు కల్పించే ప్రతిపాదన కూడా ఉందని పేర్కొన్నారు.ఈ నిర్ణయం ద్వారా ఎన్నికల సమీకరణాలను మార్చి, పాల ఉత్పత్తిదారులు ఇచ్చిన తీర్పును తారుమారు చేసే అవకాశం ఉందని పవన్ ఖేరా విమర్శించారు. సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీసే ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాన్ని అడ్డుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు స్పష్టం చేశారు.మరోవైపు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్ కార్డుకు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామంటూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలపైనా కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఓట్ల చోరీ అనేది కేవలం ముందుమాట మాత్రమేనని, అసలు కథ హక్కుల చోరీ అని విమర్శించింది. తమ శాఖ పరిధిలోని సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు పొందాలంటే ఇకపై జీవ గుర్తింపు ధ్రువీకరణతోపాటు ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య కూడా తప్పనిసరి అవుతుందని మంత్రి పేర్కొన్నట్లు కాంగ్రెస్ వెల్లడించింది. లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్ స్థానంలో ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని కేంద్ర మంత్రి గత కొన్ని రోజులుగా పలుమార్లు చెబుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు.సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును వినియోగించాలన్నది కేంద్ర ప్రభుత్వ అధికారిక విధానమా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ విధానం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు సహకార సంస్థల ఎన్నికల్లో ప్రజాతీర్పును మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, మరోవైపు సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపులో కొత్త నిబంధనలు తెరపైకి వస్తున్నాయని కాంగ్రెస్ విమర్శించింది.

తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ దందా

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు.ఇటీవల హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటించారు. 'లోక్‌తంత్ర బచావో, అరాచకత హటావో' మహాపాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఒక ఏటీఎంగా వాడుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలో ప్రస్తుతం 'ఆర్ఆర్ ట్యాక్స్' దందా నడుస్తోందని అమిత్ షా విమర్శించారు. ఆ ఆర్ఆర్ ట్యాక్స్ అంటే కేవలం రేవంత్ రెడ్డి ట్యాక్స్ మాత్రమే కాదని, ఇక్కడ వసూలు చేస్తున్న ఆ డబ్బులను ఢిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి చేరుస్తున్నారని, అందుకే అది 'రాహుల్-రేవంత్ ట్యాక్స్' అని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ప్రతిచోటా అవినీతే రాజ్యమేలుతోందని ఘాటు విమర్శలు చేశారు.

మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు

తీసుకుని ఆ పతకాన్ని ఆమెకు అంకితం చేశారు. ఆ క్షణం దేశంలోని ప్రతి పౌరుడినీ కంటతడి పెట్టించింది" అని మోదీ పేర్కొన్నారు. భారతదేశ క్రీడా వ్యవస్థలో తగినంత వనరులు లేకపోవడం, మద్దతు, పారదర్శకత కొరవడటం వంటి సవాళ్లను ఎదుర్కోవడం వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లోకి పంపడానికి ఉత్సాహం చూపలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయితే, క్రీడాకారుల మాదిరిగానే దేశం కూడా ఈ సవాళ్లను అధిగమించి, తన లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించిందన్నారు. ఇక, 4 క్రీడ ఈవెంట్లలో పోడియంపై ఉన్న మూడు స్థానాలను (బంగారం, వెండి, కాంస్యం) భారత అథ్లెట్లే కైవసం చేసుకుని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని మోదీ అన్నారు. అయితే, పోటీల చివరి రోజున మన అథ్లెట్లు ఏకంగా 9 స్వర్ణ పతకాలను సాధించి అద్భుతం చేశారని కొనియాడారు.

ముగిసిన 'పరిషత్' ఎన్నికల పోలింగ్

తిరుపతి, బాపట్ల, ఉమ్మడి గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అత్యధికంగా ఓటింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. వర్షం ప్రభావిత తీరప్రాంతాలు, కొండప్రాంతాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లా వంటి చోట్ల ఓటింగ్ శాతం కాస్త తక్కువగా రికార్డయింది. గ్రామీణ ప్రాంతాల్లో తమ సొంత నేతలను ఎన్నుకోవాలనే కుతూహలంతో ఓటర్లు తరలిరావడం పోలింగ్ శాతం పెరగడానికి కారణమైంది. అయితే, ఈ ఎన్నికల ప్రక్రియ అంతా ప్రశాంతంగా సాగలేదు. పలు జిల్లాల్లో అధికార ఎన్డీయే కూటమి , విపక్ష వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని పలు కేంద్రాల్లో రిగ్గింగ్, నకిలీ ఓట్ల ఆరోపణలతో ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు తెగబడ్డాయి. పొలిటికల్ ప్రాబల్యం చూపించేందుకు జరిగిన ప్రయత్నాలలో కొన్ని బూత్‌ల వద్ద ఉద్రిక్తతలు చోటుచేసుకోగా, పోలీసులు లాఠీఛార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.పోలింగ్ ముగియడంతో 31,460 పోలింగ్ కేంద్రాలలో ఉన్న బ్యాలెట్ పెట్టెలకు అధికారులు ఏజెంట్ల సమక్షంలో పకడ్బందీగా సీళ్ళు వేశారు. ఈ బ్యాలెట్ బాక్సులను రెవెన్యూ, పోలీస్ నిఘా నీడలో సాయంత్రానికి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వెబ్‌కాస్టింగ్ ద్వారా నమోదు చేసిన విజువల్స్‌ను విశ్లేషిస్తోంది. ఎక్కడైనా బ్యాలెట్ పేపర్లు చిరగడం, బాక్సులు ధ్వంసం కావడం లేదా ఘర్షణల వల్ల పోలింగ్ పూర్తిగా నిలిచిపోయిన స్థానాలు ఉంటే, శుక్రవారం నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉందని ఎస్ఈసీ వర్గాలు తెలిపాయి.ఇటీవలే ముగిసిన పురపాలక పోరులో ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించిన వేళ, గ్రామీణ ప్రాంతాల్లో ఏ పార్టీ జెండా ఎగురుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ పోలింగ్ ప్రక్రియ అంతా ముగియడంతో అందరి దృష్టి నవంబర్ 7న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే నెలకొంది. ఆ రోజే జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల జాతకాలు తేలనున్నాయి. ఆ తర్వాత నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ల ఎన్నికలు జరగనున్నాయి.

పరిషత్ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరపాలి..

- రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరిన వైసీపీ
- ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ తప్పనిసరి చేయాలని వినతి
- మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందన్న వైసీపీ
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన నేతలు
- ఫిర్యాదులు చేసినా ఈసీ స్పందించడం లేదని ఆరోపణ



రాష్ట్రంలోజరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని వైసీపీ డిమాండ్ చేసింది. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)ను కోరింది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ బృందంలో పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలు ఉన్నారు. అనంతరం లేళ్ల అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి కౌంటింగ్ వరకు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, రీకౌంటింగ్ పేరుతో ఫలితాలను తారుమారు చేశారని ధ్వజమెత్తారు. ఏలూరు, డోన్, ఒంగోలు వంటి పలు ప్రాంతాల్లో భారీగా అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని, బ్యాలెట్ పత్రాలను సురక్షితంగా భద్రపరచాలని వారు డిమాండ్ చేశారు. అక్రమాలకు బాధ్యులైన అధికారులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా తమ పార్టీ నేతలపై అక్రమంగా బైండోవర్ కేసులు నమోదు చేయకుండా చూడాలని కోరారు. అక్రమాలపై ఇప్పటికే 15 సార్లు ఫిర్యాదులు చేసి, పెన్‌డ్రైవ్‌ల రూపంలో ఆధారాలు అందజేసినా ఎన్నికల కమిషన్ నుంచి సరైన స్పందన లేదని పార్టీ నేత నలమారు చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష అభ్యర్థులకు రక్షణ కల్పించి, పోలీసుల వేధింపులకు అడ్డుకట్ట వేయాలని వారు ఎస్ఈసీని కోరారు.

హైదరాబాద్ మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్

ధరలను తగ్గించనున్న ప్రభుత్వం

- ప్రస్తుత ధరలు అధికంగా ఉన్నాయన్న ఫీడ్‌బ్యాక్‌తో ఈ నిర్ణయం
- రోజువారీ పాస్‌ను రూ.400 నుంచి రూ.325కి తగ్గించే అవకాశం
- నెలవారీ పాస్‌ను రూ.8,500 నుంచి రూ.4,000-4,500 మధ్యకు తగ్గింపు
- దీపావళి నుంచి సవరించిన కొత్త ధరలు అమల్లోకి వస్తాయని అంచనా

హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు చాలా అధికంగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కామన్ పాస్ ధరలు ప్రయాణికులకు భారంగా మారాయి. రోజువారీ పాస్ కోసం రూ.400, నెలవారీ పాస్ కోసం ఏకంగా రూ.8,500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ పాస్‌పై ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు, ధరలను సవరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజా నివేదికల ప్రకారం రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.325కు తగ్గించనున్నారు. అదేవిధంగా, నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి సుమారు రూ.4,000 - రూ.4,500 మధ్యకు తీసుకురావాలని భావిస్తున్నారు. ఇది అమలైతే నెలవారీ పాస్ ధర దాదాపు సగానికి తగ్గుతుంది. ఈ ఉమ్మడి పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఈ పాస్ ద్వారా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో మెట్రో రైళ్లు, ఆర్టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ ఏసీ సర్వీసులు మినహా) అపరిమితంగా ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. నగరంలో ప్రజా రవాణాను ప్రోత్సహించి, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈ పాస్‌ను ప్రవేశపెట్టారు. అయితే, ధరలు ఎక్కువగా ఉండటంతో ఆ లక్ష్యం నెరవేరలేదు. ధరల సవరణపై ఇప్పటికే మెట్రో, ఆర్టీసీ అధికారులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో జరగనున్న తదుపరి సమావేశాల అనంతరం కొత్త ధరలపై పూర్తి స్పష్టత రానుంది. ఈ నిర్ణయంతో కామన్ పాస్‌ను వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి ఇది దోహదపడుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

మురసు తుపాను ఎఫెక్ట్..

- వాయిదా పడ్డ కేఆర్ఎంబీ భేటీ
- సమావేశాన్ని వాయిదా వేయాలని కోరిన ఏపీ ప్రభుత్వం
- ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన కీలక సమావేశం
- జల వివాదాలపై చర్చలకు మరోసారి బ్రేక్
- తదుపరి తేదీపై త్వరలో స్పష్టత ఇస్తామన్న బోర్డు

అమరావతి ,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలపై చర్చించేందుకు నేడు జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం మరోసారి వాయిదా పడింది. మురసు తుపాను సహాయక చర్యల్లో అధికారులు నిమగ్నమై ఉన్నందున ఈ భేటీని వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని బోర్డు ఆమోదించింది. తుపాను ప్రభావం వల్ల అధికారులు ప్రత్యక్షంగా లేదా వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యే పరిస్థితి లేదని ఏపీ ప్రభుత్వం బోర్డుకు వివరించింది. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఉభయ రాష్ట్రాల అధికారులు అందుబాటులోకి వచ్చిన అనంతరం తదుపరి తేదీని వెల్లడిస్తామని బోర్డు స్పష్టం చేసింది. నిజానికి ఈ సమావేశం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. తొలుత అక్టోబరు 1న, అనంతరం అక్టోబరు 26న నిర్వహించాలని భావించినప్పటికీ వీలుపడలేదు. గతంలో తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటన కారణంగా వాయిదా పడగా, తాజాగా తుపాను పరిస్థితుల దృష్ట్యా మరోసారి వాయిదా పడింది. ఈ తాజా వాయిదాతో ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న కీలకమైన కృష్ణా జలాల పంపిణీ, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ, తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులు వంటి అంశాలపై చర్చలు మరోసారి నిలిచిపోయాయి. తదుపరి సమావేశం ఎప్పుడు జరుగుతుందనే దానిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

పెడనలో ఎంపీటీసీ,

జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రారంభం

పెడన కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గ పరిధిలోని పెడన, బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో గురువారం ఉదయం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయగా, పోలింగ్ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. నియోజకవర్గ పరిధిలోని పెడనలో 10, గూడూరులో 14, బంటుమిల్లిలో 13, కృత్తివెన్నులో 14 ఎంపీటీసీ సెగ్మెంట్లలో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 119 మంది అభ్యర్థులు బరిలో నిలవడంతో ఓటర్లు ఎవరికి పట్టం కట్టనున్నారనే అంశం ఆసక్తికరంగా మారింది.

సత్యకుమార్‌కు షాక్

షో ఎక్కువ.. రియాల్టీ తక్కువ

అనంతపురం కూటమిలో ఉన్న బీజేపీకి తన బలమేంటో ఇప్పుడు తెలిసి వచ్చింది. ముఖ్యంగా బీరాలు పలికే మంత్రి సత్యకుమార్ కు అనంతపురం కార్పొరేషన్ కోల్పోవడం కోలుకోలేని దెబ్బ అని చెప్పాలి. తాను ధర్మవరంలో ఎమ్మెల్యేగా ఉంటూ అనంతపురం కార్పొరేషన్ లో కనీసం అభ్యర్థిని గెలిపించుకోలేక పోవడం మంత్రి సత్యకుమార్ పై పార్టీ నాయకత్వం కూడా గుర్రుగా ఉంది. కూటమి పార్టీల నేతలు, ఓటు బ్యాంకును సమన్వయం చేసుకోవడంలో సత్యకుమార్ ఘోరంగా విఫలమయ్యారన్న వాదన బలంగా వినిస్తుంది. సత్యకుమార్ యాదవ్ కు తన బలమేంటో తనకు తెలియదు. గాలి వాటాన గెలవడం కాదు. ప్రజల తీర్పు ఎలా ఉంటుందో అనంతపురం ప్రజలు ఇప్పుడు రుచి చూపించారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయినంత మాత్రాన లీడర్ అయపోరు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఇప్పటికైనా సత్యకుమార్ వాస్తవాలు తెలుసుకుని నేల మీద నడిస్తే వచ్చే ఎన్నికల నాటికి కొంతైనా పార్టీ మెరుగుపడుతుంది అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల ఫలితాల్లో వైసీపీ విజయం సాధించడం కూటమి తరఫున ప్రచార బాధ్యతలు మోసిన మంత్రి సత్యకుమార్‌కు పెద్ద ఎదురుదెబ్బగా నిలిచింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ఈ స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నప్పటికీ, మేయర్ పీఠాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని అన్ని చోట్ల గెలిచిన కూటమి అనంతపురంలో మాత్రం చతికలపడటానికి సత్యకుమార్ నాయకత్వమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వాదనను ఆయనను అంగీకరించకపోవచ్చు. కుంటిసాకులు చెప్పొచ్చు. కానీ బీజేపీ ఓటమికి నైతిక బాధ్యతను మాత్రం సత్యకుమార్ తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఓట్ల బదిలీ చేయించడంలో మంత్రిగా సత్యకుమార్ యాదవ్ సక్సెస్ కాలేకపోయారు. కూటమిలో ఉంటే గెలుస్తామన్న గుడ్డి నమ్మకం ఉంటే చాలదు. దానికి కావాల్సిన సోషల్ ఇంజినీరంగ్ తో పాటు అభ్యర్థి ఎంపిక, ప్రచారం వంటివి కూడా కీలకంగా మారతాయన్నది ఆయన గ్రహించాలి.. అనంతపురం కార్పొరేషన్ లో మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ తన సమీప బీజేపీ అభ్యర్థి అజేష్ యాదవ్‌పై 5,981 ఓట్ల భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ విజయాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని మేయర్ పీఠంపై కూర్చోబెట్టడమే లక్ష్యంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ నగరంలో స్వయంగా ఉండి ముమ్మర ప్రచారం నిర్వహించారు. సినీ నటుడు సాయికుమార్‌తో రోడ్ షోలు కూడా చేయించారు. అయితే, తీవ్ర పోటీ నడుమ ఫలితం భిన్నంగా రావడంతో రాజకీయంగా ఇది ఆయనకు గట్టి షాక్‌గా మారినట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి. మేయర్ స్థానాన్ని కోల్పోయినప్పటికీ, కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో కూటమి మెరుగైన స్థానాలను సాధించింది. మొత్తం స్థానాల్లో కూటమి 37 స్థానాలను దక్కించుకుంది. టీడీపీ 30, జనసేన 6, బీజేపీ ఒక స్థానం గెలుచుకోగా, వైసీపీ 21 స్థానాల్లో విజయం సాధించింది.కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య మేయర్ అభ్యర్థిత్వం మరియు సీట్ల సర్దుబాటు విషయంలో ఆశావహుల అంచనాలను సమతుల్యం చేయడంలో ఎదురైన సవాళ్లు, అంతర్గత విభేదాలు కూటమి మేయర్ అభ్యర్థి ఓటమికి దారితీశాయని విశ్లేషకులు భావిస్తున్నారు

ఆ ఐదే... సక్సెస్ ఫార్ములా...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల సమరంలో టీడీపీ-జనసేన-బీజేపీల ఎన్డీయే కూటమి తిరుగులేని ప్రభంజనాన్ని సృష్టించింది. కార్పొరేషన్లు మొదలుకుని నగర పంచాయతీల వరకు రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు ఏకపక్ష విజయాలను నమోదు చేశారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అతి కష్టం మీద కేవలం మూడు మున్సిపల్ చైర్మన్ పీఠాలకే పరిమితమై అస్తిత్వ సంక్షోభంలో కూరుకుపోయింది. సాధారణంగా అధికారం మారిన కొత్తలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏకపక్షంగా ముగుస్తాయన్నది నాణేనికి ఒక వైపే, కానీ క్షేత్రస్థాయిలో కూటమి సాధించిన ఈ అపూర్వ స్వీప్‌కు కేవలం అధికార బలమే కారణం కాదు. పకడ్బందీ వ్యూహం, బలమైన ఐక్యత, ప్రజామోదం కలగలసిన ఐదు ప్రధాన అంశాలే కూటమి విజయ ఢంకా మోగించడానికి దారితీశాయి.కూటమి విజయానికి ప్రథమ, ప్రధాన పునాది మూడు పార్టీల మధ్య ఉన్న తిరుగులేని ఐక్యత. సార్వత్రిక ఎన్నికల నాటి కలయిక కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే కాదని, అది ఒక బలమైన భావజాల బంధమని మరోసారి రుజువైంది. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి సోషల్ మీడియా వేదికగా విపక్ష శ్రేణులు తీవ్రస్థాయిలో విష ప్రచారం సాగించాయి. జనసేన ఓటర్లు అసంతృప్తితో ఉన్నారని, ఆ ఓట్లు వైసీపీ వైపు మళ్లుతున్నాయంటూ పక్కా ప్లాన్‌తో రెచ్చగొట్టే యత్నాలు జరిగాయి. అయితే, కూటమి అగ్రనేతలు, క్షేత్రస్థాయి కేడర్ ఈ మైండ్ గేమ్‌ను, కుట్రలను ఇట్టే పసిగట్టారు. ఫలితంగా క్షేత్రస్థాయిలో ఓటు బదిలీ ఎలాంటి గందరగోళం లేకుండా నూటికి నూరు శాతం సాఫీగా జరిగిపోయింది. విపక్ష కుతంత్రాలు బెడిసికొట్టి, కూటమి బంధం మరింత పటిష్టమవడానికి ఈ ఎన్నికలు దోహదపడ్డాయి.పాత మూస రాజకీయాలకు స్వస్తి పలుకుతూ అభ్యర్థుల ఎంపికలో కూటమి ప్రదర్శించిన సాహసోపేత నిర్ణయాలు పట్టణ ఓటర్లను విశేషంగా ఆకర్షించాయి. దశాబ్దాలుగా పాతుకుపోయిన వారసత్వ, సంప్రదాయ నేతలకే పరిమితం కాకుండా.. జెన్-జీ తరంతో పాటు సాధారణ మధ్యతరగతి విద్యావంతులైన యువతీయువకులకు భారీగా టిక్కెట్లు కేటాయించారు. కార్పొరేషన్లు, మున్సిపల్ వార్డుల్లో కొత్త ముఖాలు, ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న యువ అభ్యర్థులు బరిలోకి దిగడంతో సహజంగానే పట్టణ ప్రాంతాల్లోని యూత్, విద్యావంతులైన ఓటర్లు కూటమి అభ్యర్థుల వైపు ఏకపక్షంగా మొగ్గు చూపారు. ఈ వ్యూహాత్మక మార్పు క్లీన్‌స్వీప్‌కు బలమైన చోదకశక్తిగా మారింది.పొత్తుల రాజకీయాల్లో స్థానిక స్థాయిలో సీట్ల సర్దుబాటు ఎప్పుడూ అత్యంత క్లిష్టమైన అంశమే. ఈ ఎన్నికల్లోనూ పలు డివిజన్లు, వార్డుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య ఆశావహుల తీవ్ర పోటీ, అసంతృప్తులు తలెత్తిన మాట వాస్తవమే. అయితే, ఏ ఒక్క నాయకుడూ వ్యక్తిగత విభేదాలతో తమ పార్టీల ఉమ్మడి ప్రయోజనాలకు గండి కొట్టే ప్రయత్నం చేయలేదు. సీనియర్ నాయకత్వం సకాలంలో జోక్యం చేసుకుని సమన్వయ కమిటీల ద్వారా అసమ్మతులను చల్లార్చడం, కేడర్ అంతా కూటమి విజయమే అంతిమ లక్ష్యం గా భావించి సమష్టిగా పనిచేయడం వల్ల ఎక్కడా క్రాస్ ఓటింగ్‌కు ఆస్కారం లేకుండా పోయింది. క్రమశిక్షణతో కూడిన ఈ సమన్వయం కూటమి ఓటు బ్యాంకును ఒక్కతాటిపై నిలిపింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతల ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. గత ఐదేళ్ల పాలనలో కనిపించిన అరాచక సంస్కృతి, కక్షసాధింపులు, ఫ్యాక్షన్ భయాలు తొలిగిపోయి.. ప్రజలకు అసలైన మనశ్శాంతి లభించింది. ఎటువంటి రాజకీయ వేధింపులు లేని ప్రశాంత వాతావరణం, సుపరిపాలన ప్రజల్లో నమ్మకాన్ని నింపాయి. దీనికి తోడు రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల ఆధునీకరణ, అమరావతి రాజధాని పనులు, నగరాల్లో మౌలిక వసతుల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలు జోరందుకోవడంతో.. కూటమి పాలనతోనే నగరాలకు భవిష్యత్తు అన్న బలమైన సంకేతం పట్టణ ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ఈ ప్రశాంతతకే ఓటర్లు బ్యాలెట్ బాక్సుల ద్వారా జై కొట్టారు.కూటమి బలాలకు తోడుగా.. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రదర్శించిన నైరాశ్యం, పూర్తి చేతకానితనం కూటమి పనిని మరింత సులువు చేసింది. సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత ఆ పార్టీ అగ్ర నాయకత్వం నుంచి క్షేత్రస్థాయి శ్రేణుల వరకు ఆత్మవిశ్వాసం పూర్తిగా అడుగంటింది. అనేక చోట్ల అసలు ఎన్నికల్లో పోటీ చేయడమే గొప్ప అన్నట్లుగా నిస్తేజంగా వ్యవహరించారు. ఎలాగూ ఓడిపోతాం.. పోటీ నామమాత్రంగా చేస్తే చాలు అన్నట్లుగా అభ్యర్థులు చేతులెత్తేయడం, అధిష్ఠానం నుంచి సరైన ఆర్థిక, సంస్థాగత సహాయం అందకపోవడం వైసీపీ కొంపముంచింది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి లేక, కేవలం సోషల్ మీడియాకే పరిమితమైన వైసీపీ వైఫల్యం.. కూటమికి సంపూర్ణ విజయానికి తివాచీ పరిచింది.

రౌడీ షీటర్లపై సిరిసిల్ల పోలీసుల డేగకన్ను!



రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల ఇళ్లలో పోలీసులు ఆకస్మిక రాత్రి తనిఖీలు నిర్వహించారు.ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హెచ్చరించారు. నేరాలకు దూరంగా సత్ప్రవర్తనతో జీవించాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. పూర్తిగా ప్రవర్తన మార్చుకున్న వారి షీట్లను నిబంధనల ప్రకారం తొలగిస్తామని స్పష్టం చేశారు.

ఏపీలో వార్ వన్ సైడే

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఊహించిన రీతిలోనే ఏకపక్ష తీర్పును ప్రతిబింబించాయి. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు , నగర పంచాయతీలలో అధికార ఎన్డీయే కూటమి తన తిరుగులేని ఆధిపత్యంతో సునామీ తరహా విజయాన్ని నమోదు చేసుకుంది. సాధారణంగానే స్థానిక సంస్థల ఎన్నికలలో అధికారంలో ఉన్న పార్టీలకే అత్యధికంగా రూలింగ్ అడ్వాంటేజ్ లభిస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం, నిధుల సాధికారత, వార్డుల అభివృద్ధిపై ఆశలు పట్టణ ఓటర్లను అధికార కూటమి వైపే నిలబడేలా చేశాయి. అయితే, కేవలం అధికార బలం మాత్రమే కాకుండా ఈ విజయం వెనుక అనేక లోతైన రాజకీయ సమీకరణాలు పనిచేశాయని భావిస్తున్నారు.ఈ ఘనవిజయానికి ప్రధాన బలమైన కారణాలలో మొదటిది అసెంబ్లీ ఎన్నికల దెబ్బ నుంచి వైఎస్సార్‌సీపీ కోలుకోలేకపోవడం. సార్వత్రిక ఎన్నికల ఓటమి అనంతరం ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యం, స్థానిక నాయకత్వాల్లో వచ్చిన స్పష్టమైన డీమోరలైజేషన్ క్షేత్రస్థాయి ఫలితాలపై పడింది. వైఎస్సార్‌సీపీ ద్వితీయ శ్రేణి నేతలు, కేడర్ ఆశించిన స్థాయిలో ఆర్థిక, నైతిక బలాన్ని అందించుకోలేకపోయారు. ప్రతిపక్షం తన శ్రేణులను ఎన్నికల వేడికి సిద్ధం చేసి ఓటర్లను బూత్‌లకు తరలించే సమర్థవంతమైన ఎలక్షన్ మేనేజ్‌మెంట్ లేకపోవడం వల్ల పట్టణాల్లో వ్యతిరేక ఓటు బ్యాంకు స్థిరీకరించబడలేదు.రెండవ బలమైన అంశం అధికార ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య కొనసాగుతున్న , రోజురోజుకూ మరింత బలపడుతున్న రాజకీయ సఖ్యత. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీలు సమన్వయాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగాయి. సోషల్ మీడియా వేదికగా కూటమి పార్టీలు, ముఖ్యంగా టీడీపీ , జనసేన శ్రేణుల మధ్య విభేధాలు ఉన్నట్లు చూపుతూ, పొత్తుకు గండికొట్టేందుకు ఓ వర్గం ఎంతగానో ప్రయత్నించింది. కానీ ఆ డిజిటల్ నెరేటివ్‌లు లేదా దుష్ప్రచారాలు పట్టణ ఓటర్ల మూడ్‌ను ఏమాత్రం మార్చలేకపోయాయి. కూటమి నేతలు ఒకే సంకేతాన్ని పంపడం, వార్డు స్థాయిల్లోనూ సమన్వయంతో పోటీ పడటంతో అధికార పక్షానికి తిరుగులేని మెజార్టీ సొంతమైంది.అయితే, ఈ మున్సిపల్ ఫలితాలను రాబోయే అసెంబ్లీ లేదా సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాభిప్రాయానికి ముందస్తు కొలమానంగా లేదా సూచికగా పరిగణించలేమని రాజకీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఎందుకంటే, స్థానిక ఎన్నికల ఓటింగ్ ప్రాధాన్యతలు ఎప్పటికీ వేరేగా ఉంటాయి. కార్పొరేషన్, మున్సిపల్ పోరులో నిత్యం కంటికి కనిపించే లోకల్ సమస్యలు, అభ్యర్థి వ్యక్తిగత సంబంధాలు, పారిశుధ్యం, వీధిదీపాలు, డ్రైనేజీ, స్థానికంగా లభించే ప్రభుత్వ ప్రాపకం ప్రాధాన్యత వహిస్తాయి. ఇక్కడ ఓటరు రాజకీయం కంటే తక్షణ అనుకూలతకే మొగ్గు చూపుతారు. అసెంబ్లీ లేదా పార్లమెంట్ సమరానికి వచ్చేసరికి ఓటరు ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోతాయి. అక్కడ రాష్ట్రాభివృద్ధి, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు, పెద్ద ఎత్తున జరిగే సంక్షేమం, జాతీయ రాజకీయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఈ వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవడం అన్ని రాజకీయ పార్టీలకూ తెలుసు. కాబట్టి స్థానిక ఎన్నికలలో దక్కిన ఈ సునామీ విజయాన్ని చూసి ఎన్డీయే కూటమి అతివిశ్వాసానికి పోవడానికి ఎంత అవకాశాలు లేవో, అలాగే వైఎస్సార్‌సీపీ ఈ ఫలితాలను చూసి పూర్తిగా నిరాశలో కూరుకుపోవాల్సిన అవసరమూ లేదు.ఆంధ్రప్రదేశ్ పట్టణ ఓటరు ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో అభివృద్ధి, సుస్థిరతకు మద్దతుగా ఎన్డీయే కూటమికి పట్టంగట్టారు. ఈ తీర్పు కూటమి పాలనకు ప్రజల నుంచి లభించిన బలమైన ఆమోదముద్ర అయినప్పటికీ, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు రూపొందించుకోవడంలో ఈ ఫలితాలు కేవలం తాత్కాలిక సూచీలుగా మాత్రమే పనిచేస్తాయి.

రాయలసీమకే పరిమితమైన వైసీపీ

కర్నూలు : వైసీపీ ఇంకా కోలుకోలేదు. మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఓటమి అనేక కారణాలు వెతుక్కోవచ్చు. కానీ రాష్ట్రమంతటా ఒకే కారణం కనిపించలేదు. రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో నామినేషన్లను అడ్డుకోవడం, పోలింగ్ కేంద్రాల వద్ద ఏజెంట్లను అనుమతించకపోవడం, తమకు అనుకూలురైన ఓటర్లను నిలిపేయడం వంటి కారణాలు జరిగి ఉండవచ్చు. కానీ కోస్తాంధ్ర, రాయలసీమలో ఏం జరిగినట్లు? అక్కడ ఎందుకు వైసీపీ చతికలపడినట్లు? ఈ ఒక్క ఆలోచన జగన్ చేస్తే చాలు తాము చేసే తప్పిదాలు సరిచేసుకునే వీలుంటుందని వైసీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలోనూ వైసీపీకి ఓట్లు పడకపోవడం ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విశాఖ, విజయనగరం, విజయవాడ, గుంటూరు నెల్లూరు కార్పొరేషన్లలో ఓటమి పాలవ్వడం ఖచ్చితంగా లోపమెక్కడన్నది తెలుసుకోవాల్సి ఉంటుంది 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాయలసీమతో పోలిస్తే ఉత్తరాంధ్ర లోనివిశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయానికి స్పష్టమైన ప్రాంతీయ, వ్యూహాత్మక కారణాలు ఉన్నాయి. 2019లో ఈ ప్రాంతంలో 28 స్థానాలు గెలుచుకున్న వైసీపీ, ఈ ఎన్నికల్లో చావుదెబ్బ తింది.వైసీపీ ప్రభుత్వం విశాఖపట్నాన్ని పరిపాలనా రాజధానిగా మారుస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. అయితే, ఇది కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో ఎలాంటి శాశ్వత అభివృద్ధి లేదా సచివాలయాల తరలింపు జరగకపోవడంతో ఉత్తరాంధ్ర ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. అంతేకాకుండా, రుషికొండ నిర్మాణాలపై వివాదాలు, భూ ఆక్రమణల ఆరోపణలు నగర ఓటర్లలో ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. అధికార పక్షం పై వైసీపీ చేసిన ఆరోపణలు కూడా ప్రజలు విశ్వసించలేదు. టీడీపీ విశాఖ మేయర్ స్థానాన్ని ఇంత వరకూ గెలవలేదు. తొలి సారి గెలిచిందంటే వైసీపీపై నమ్మకంలేకపోవడం వల్లనేనన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఉత్తరాంధ్ర మొదటి నుండి వెనుకబడిన కులాల కు గట్టి పట్టున్న ప్రాంతం. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఇక్కడి ప్రధాన సామాజిక వర్గాలను ఏకం చేయడంలో విజయవంతమైంది. పవన్ కళ్యాణ్ ప్రభావంతో కాపు ఓట్లు, చంద్రబాబు వ్యూహాలతో బీసీ ఓటర్లు అంటే ముఖ్యంగా తూర్పు కాపు, వెలమ, గవర, కాళింగ సామాజిక వర్గాలు పూర్తిగా కూటమి వైపు మళ్లడం వైసీపీకి పెద్ద మైనస్ అయింది.ఉత్తరాంధ్ర యువత ఉపాధి కోసం విశాఖపట్నంలోని ఐటీ హబ్స్, ఫార్మా రంగాన్ని నమ్ముకుంటారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కొత్తగా పెద్ద పరిశ్రమలు రాకపోవడం, విశాఖ ఐటీ హిల్స్ నెమ్మదించడం యువతలో అసంతృప్తి నింపింది. కూటమి ప్రకటించిన "జాబ్ క్యాలెండర్" హామీలు, మెగా డీఎస్సీ ప్రకటనలు యువతను ఆకర్షించాయి. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని కూడా స్థానిక కార్మిక వర్గం సీరియస్‌గా తీసుకుంది. విశాఖ కేంద్రంగా మౌలిక సదుపాయాల కల్పన మరియు ఉద్యోగాల సృష్టిలో వెనుకబడటం ఉత్తరాంధ్ర ప్రజలు కూటమికి పట్టం కట్టేలా చేసింది

వాయుగుండంతో కుంభవృష్టి

విజయవాడ : తీవ్ర తుపాను మురసు తీరం దాటిన అనంతరం చూపించిన అసలు ప్రతాపం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు జిల్లాలను అతలాకుతలం చేసింది. సాధారణంగా తుపాన్లు తీరం దాటిన తర్వాత బలహీనపడటం సహజమే అయినప్పటికీ, మురసు భూభాగంపైకి ప్రవేశించి తీవ్ర వాయుగుండంగా నెమ్మదిగా కదలడం వల్ల కుంభవృష్టిని కురిపించింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్న రీతిలో గంటల వ్యవధిలోనే 20 నుంచి 27 సెంటీమీటర్లకు పైగా కుండపోత వర్షం నమోదైంది. తీర ప్రాంత జిల్లాలతో పాటు లోతట్టు ప్రాంతాలు అనూహ్య రీతిలో జలమయమై నదులు, వాగులు ఉగ్రరూపం దాల్చడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని నాలుగు కీలక జిల్లాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.

గుంటూరు, పల్నాడు, బాపట్ల బెల్ట్‌లో వర్ష తీవ్రత అల్లకల్లోలం సృష్టించింది. గుంటూరు నగరంలో ప్రధాన రహదారులు చెరువులను తలపించగా, సమీప గ్రామీణ ప్రాంతాల్లో నల్లమడ వాగు, నక్కవాగులకు గండ్లు పడి కాకుమాను, పెదనందిపాడు మండలాల్లోని గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. యడ్లపాడులో ఐదున్నర గంటల వ్యవధిలోనే ఏకంగా 26.8 సెంటీమీటర్ల వర్షపాతం కురిసి రికార్డు సృష్టించింది. రహదారులపై వెళ్లే వాహనాలు కొట్టుకుపోయేంత స్థాయిలో వరద పోటెత్తింది. గోడలు కూలి, వరద నీటిలో గల్లంతై నలుగురు ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను చాటుతోంది. లక్షలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మిర్చి పైర్లు నీటమునిగి తీవ్ర నష్టం వాటిల్లింది.ఇక ఉమ్మడి కృష్ణా , ఏలూరు జిల్లాల్లోనూ వరద విలయం కొనసాగుతోంది. విజయవాడ పరిసర ప్రాంతాలతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం, నందిగామ, తిరువూరు ప్రాంతాల్లో కట్టలేరు, వైరా నదులు ప్రమాదకర స్థాయికి మించి పొంగి ప్రవహిస్తున్నాయి. దాములూరు కాజ్‌వే, తోటమూల వద్ద రోడ్లు కొట్టుకుపోవడంతో దాదాపు 20కి పైగా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏలూరు నగరంలో లోతట్టు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, పశ్చిమ గోదావరి, ఏలూరు సరిహద్దుల్లోని పంట కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ వద్దకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతుండటంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.మరోవైపు తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలపై ఈ తుపాను ప్రభావం పెను విలయాన్ని మిగిల్చింది. అశ్వారావుపేట మండలంలో అత్యధికంగా 27.6 సెంటీమీటర్లు, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో 20 సెంటీమీటర్లకు పైగా కురిసిన వర్షానికి చెరువులు, వాగులు కట్టలు తెంచుకున్నాయి. పాల్వంచ-దమ్మపేట ప్రధాన మార్గంలో తాత్కాలిక అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో భారీగా రాకపోకలు స్తంభించాయి. వైరా జలాశయం నిండుకుండలా మారగా, మల్లెపూల వాగు ముంచెత్తడంతో వేలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగింది. సత్తుపల్లి వద్ద చెరువులో చిక్కుకున్న వారిని కాపాడటానికి వెళ్లి ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందే గల్లంతయ్యారు.

విజువల్ వండర్.. 'రామాయణ'పై రాజమౌళి రివ్యూ



భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న విజువల్ వండర్ 'రామాయణ: పార్ట్ 1' దీపావళి కానుకగా నేడు (నవంబర్ 5) ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రంపై దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. సినిమా చూసిన అనంతరం ఆయన చిత్ర బృందాన్ని అభినందిస్తూ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు."సినిమా స్కేల్, భారీ విజువల్స్ తెరపై చూడటానికి అద్భుతంగా ఉన్నాయి. రాముడిగా రణ్‌బీర్, ముఖ్యంగా వనవాసం ఎపిసోడ్ నుంచి చాలా ప్రశాంతంగా, గంభీరంగా కనిపించారు. రావణుడిగా యశ్ తన ఉనికితో భయపెట్టగా, సీతగా సాయిపల్లవి ఎంతో హుందాగా ఒదిగిపోయారు. ప్రీ-క్లైమాక్స్, క్లైమాక్స్ ప్రతి క్షణాన్ని ఆస్వాదించాను. ఇంతటి భారీ దృశ్య కావ్యాన్ని ఇంత అందంగా తెరకెక్కించిన నితేశ్ తివారి, నమిత్ మల్హోత్రాతో పాటు చిత్ర బృందానికి నా అభినందనలు" అని రాజమౌళి పేర్కొన్నారు .'దంగల్' వంటి బ్లాక్‌బస్టర్ అందించిన నితేశ్ తివారీ దర్శకత్వంలో వాల్మీకి రామాయణం ఆధారంగా ఈ దృశ్య కావ్యం రూపుదిద్దుకుంది. భారతీయ సినీ చరిత్రలోనే అత్యధికంగా సుమారు రూ.4,000 కోట్లకు పైగా బడ్జెట్‌తో, రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని నిర్మించారు. అత్యాధునిక మోషన్ క్యాప్చర్, వీఎఫ్ ఎక్స్ టెక్నాలజీతో తెరకెక్కిం చిన ఈ సినిమా విజువల్స్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. 'రామాయణ' చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయిపల్లవి, రావణాసురుడిగా కేజీఎఫ్ ఫేమ్ యశ్ నటించారు. యశ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా కూడా వ్యవహరించడం విశేషం. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, దశరథుడిగా అరుణ్ గోవిల్, కైకేయిగా లారా దత్తా కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ పాటలు అందించగా, హాలీవుడ్ లెజెండరీ కంపోజర్ హాన్స్ జిమ్మర్ నేపథ్య సంగీతం సమకూర్చారు. ఒక భారతీయ చిత్రానికి హాన్స్ జిమ్మర్ పనిచేయడం ఇదే తొలిసారి. ప్రైమ్ ఫోకస్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, డీఎన్ఈజీ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ప్రస్తుతం ఈ సినిమా అద్భుతమైన టాక్‌తో ప్రదర్శితమవుతూ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతోంది.


హీరోకి చాలా గట్స్..

'ఇట్లు అర్జున' ట్రైలర్ లాంచ్ చేసి, టీమ్‌ను మెచ్చుకున్న ఎన్టీఆర్



యువ కథానాయకుడు అనీష్, అందాలభామ అనశ్వర రాజన్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఇట్లు అర్జున'. ఈ సినిమా ట్రైలర్‌ను యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ బుధవారం సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలుపుతూ, ముఖ్యంగా డెబ్యూ హీరో అనీష్ నటనను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.ట్రైలర్ విడుదల సందర్భంగా ఎన్టీఆర్ తన సోషల్ మీడియా ఖాతాలో స్పందిస్తూ, "ఇదిగో 'ఇట్లు అర్జున' ట్రైలర్. అనీష్, నీ తొలి సినిమాలోనే ఒక్క మాట కూడా లేకుండా నటించడం నిజంగా గొప్ప ధైర్యం. కథ మీద నమ్మకంతో ఇలాంటి పాత్రను ఎంచుకోవడం అభినందనీయం. నీకు మంచి ఆరంభం లభించాలని కోరుకుంటున్నాను సోదరా" అని పేర్కొన్నారు. అలాగే సంగీత దర్శకుడు తమన్, అనశ్వర రాజన్, దర్శకుడు మహేశ్ ఉప్పాల, రాజా మహాదేవన్, వెంకీ కుడుముల సహా మొత్తం చిత్ర బృందానికి నవంబర్ 13న విడుదలవుతున్న సినిమాకు శుభాకాంక్షలు తెలిపారు.తాజాగా విడుదలైన ట్రైలర్‌ను గమనిస్తే, కథానాయకుడు అర్జున్ (అనీష్)కు మాటలు రావు. అంతేకాదు, అతను చేయితిరిగిన దొంగ. నగరంలో జరిగిన ఓ దొంగతనం కేసులో పోలీసులు అతడినే ప్రధాన నిందితుడిగా అనుమానించి వెతుకుతుంటారు. మరోవైపు, అర్జున్ తన స్నేహితురాలు కీర్తి (అనశ్వర రాజన్)ని ప్రేమిస్తుంటాడు. చదువుపై శ్రద్ధ చూపే కీర్తి, అర్జున్‌ను మంచివాడిగా నమ్ముతుంది.ఇదే సమయంలో, రూ.1000 కోట్లకు సంబంధించిన ఒక పెన్‌డ్రైవ్ కోసం ఓ భయంకరమైన గ్యాంగ్ వెతుకుతుంటుంది. ఆ డబ్బు కోసం వారు ఎంతకైనా తెగిస్తారు. కొన్ని కారణాల వల్ల ఆ గ్యాంగ్, పోలీసులతో పాటు అర్జున్, కీర్తి వెంట పడుతుంది. ఈ ఉత్కంఠభరితమైన ఛేజింగ్‌లో ఏం జరిగిందనేది కథాంశంగా తెలుస్తోంది.ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు వెంకీ కుడుముల తన 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై నిర్మాతగా వ్యవహరించడం విశేషం. స్టార్ హీరో అక్కినేని నాగార్జున ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఈ సినిమాతో మహేశ్ ఉప్పాల దర్శకుడిగా, అనీష్ హీరోగా పరిచయం అవుతున్నారు. సౌత్ ఇండియా టాప్ మ్యూజిక్ డైరెక్టర్లలో ఒకరైన తమన్ సంగీతం అందిస్తుండగా, రాజా మహాదేవ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. మొదట అక్టోబర్ 30న విడుదల కావాల్సి ఉన్న ఈ చిత్రం, వాయిదా పడి నవంబర్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మదరాసి రబ్బరుబొమ్మ



బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. నేహా శెట్టి కథానాయిక. సాగర్‌చంద్ర దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదలకానున్నది. ప్రచారంలో భాగంగా ఈ సినిమాలోని తొలిపాట 'మదరాసి రబ్బరుబొమ్మ..'ను ఈ నెల 6న మేకర్స్ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని విడుదల చేశారు. సంప్రదాయ ఫోక్ లుక్‌లో కనిపిస్తున్న హీరోహీరోయిన్లను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఇందులో బెల్లంకొండ శ్రీనివాస్ మునుపెన్నడూ చూడని యాక్షన్ ప్యాక్ క్యారెక్టర్‌లో కనిపిస్తారని, ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకమైన సినిమా ఇదని డైరెక్టర్ సాగర్‌చంద్ర చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్ జ్ఞానేష్, అనిత్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణ: 14రీల్స్ ప్లస్.

ఆమె ఒక మెరుపు..

ఒక పటాక



తెలుగందం శ్రీలీలను అద్భుతమైన అవకాశం వరించింది. సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో నటలోకనాయకుడు కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ కలిసి నిర్మిస్తున్న 'ధర్మన్' సినిమాలో ఆమె కీలకపాత్ర పోషిస్తున్నది. గత కొన్ని రోజులుగా 'ధర్మన్'లో శ్రీలీల నటిస్తున్నట్టు సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ విషయాన్ని అధికారికంగా చిత్రబృందం ధృవీకరించింది. ఈ సందర్భంగా శ్రీలీలకు స్వాగతం పలుకుతూ, ఈ సినిమాలోని ఆమె పాత్రను పరిచయం చేస్తూ ఓ గ్లింప్స్‌ని బుధవారం మేకర్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో శ్రీలీల ఆకట్టుకునే అవతారంలో కనిపించి, సినిమాపై ఆసక్తిని పెంచారు. అనిరుధ్ రవిచందర్ అందించిన క్లాసికల్ మ్యూజిక్ ఆమె పరిచయ సన్నివేశాలకు మరింత అందాన్ని తెచ్చింది. Sheμs the spark and sheμs the pataka అనే క్యాప్షన్ శ్రీలీల పాత్ర సినిమాలో ఎంత సందడి చేయనున్నదో తెలియజేస్తున్నది. డెడ్లీ డాక్టర్‌గా మిస్టీరియస్ పాత్రలో రజనీకాంత్ నటిస్తున్న ఈచిత్రంలో నయనతార కథానాయిక. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి.




క్యూట్‌గా.. బబ్లీగా.. కాస్తంత చలాకీగా..



'నా మూలాలు కర్నాటక అయినా.. పుట్టిపెరిగింది మాత్రం హైదరాబాద్‌లోనే. చిన్నప్పట్నుంచీ శ్రీదేవిగారంటే ఇష్టం. ఆమెను చూసే నటన, నాట్యం నేర్చుకున్నా. ఫారిన్‌లో చదువుతూ కూడా థియేటర్‌ని వదల్లేదు. 'జగమే సంగీతం' వెబ్ సిరీస్‌తో నా కెరీర్ మొదలైంది. లీడ్ హీరోయిన్‌గా నా తొలి సినిమా 'దొంగ నా కొడుకు'. తొలిసారి బిగ్ స్క్రీన్‌పై నన్నునేను చూసుకోబోతున్నందుకు ఎక్సయిటెడ్‌గా ఉంది' అని కథానాయిక సుష్మితా శెట్టి అన్నారు. మౌళి తనూజ్ ప్రశాంత్‌కి జోడీగా ఆమె నటించిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'దొంగ నా కొడుకు'. శ్రీను కంబాల దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈచిత్రం ఈ నెల 13న విడుదల కానున్నది ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో సుష్మితా శెట్టి మాట్లాడారు. 'ఇందులో క్యూట్‌గా బబ్లీగా కాస్తంత చలాకీగా కనిపిస్తా. తనకు తాను చాలా స్మార్ట్ అనుకునే పాత్ర అనమాట. హీరోని పిచ్చిగా ప్రేమిస్తుంది. ఓ క్రైమ్‌లో తెలియకుండానే అమాయకంగా ఇరుక్కుంటుంది. ప్రేక్షకులు నా పాత్రను బాగా ఎంజాయ్ చేస్తారు' అని తెలిపింది సుష్మితాశెట్టి. మైత్రీ మూవీమేకర్స్‌లో పనిచేయడం ఆనందంగా ఉందని, హీరో మౌళీతో వర్క్ చేయడం చాలామంది అనుభవమని, టైటిల్ మాదిరిగానే సినిమా కూడా హ్యూమ రస్‌గా, హాయిగా నవ్వుకునేలా ఉంటుందని సుష్మితా శెట్టి చెప్పింది.

ప్రేక్షకులంతా చిన్నపిల్లలై

ఎంజాయ్ చేస్తారు



'ఈ సినిమాలో నటించిన పిల్లల్ని చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది. ఆ వయసులో నాకు ఏదీ తెలిసేది కాదు. ఈ జనరేషన్ ఫాస్ట్‌గా ఉంది. మరచిపోయిన జ్ఞాపకాలను గుర్తుచేసే సినిమా ఇదని కథ,కథనాల గురించి వింటే తెలిసింది. ఎక్కడా ఇది చిన్నపిల్లల సినిమాగా అనిపించదం లేదు. నిర్మాత ధీరజ్ నమ్మకం నిజం కావాలి. ఆయనకు ఈసినిమా పెద్ద విజయాన్ని ఇవ్వాలి. థియేటర్లలో ఈ సినిమా చూడండి. ప్రేక్షకులంతా చిన్నపిల్లలై ఎంజాయ్ చేస్తారు' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబీ ఖుషి ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'సమ్మర్ హాలిడేస్'.శ్రీకర్ నయన్ దర్శకుడు. ధీరజ్ మొగలినేని నిర్మాత. ఈనెల 6న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి అతిథిగా విచ్చేసిన కిరణ్ అబ్బవరం పై విధంగా మాట్లాడారు. మరో ముఖ్య అతిథి అగ్ర నిర్మాత అల్లు అరవింద్ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఇది పిల్లల సినిమా కాదని, ఇద్దరు చిన్న హీరోలు నటించిన సినిమా అనీ, ఇందులో అమ్మమ్మగా నటించానని సహజనటి జయసుధ చెప్పారు. ఈ సినిమా చూసి బయటకు వచ్చాక ప్రతి ఒక్కరూ తమ చిన్ననాటి స్నేహితులకు ఫోన్ చేస్తారని, బాల్యాన్ని గుర్తుచేసే అద్భుతమైన సినిమా ఇదని నిర్మాత ధీరజ్ మొగిలినేని అన్నారు. ఇంకా చిత్రబృందంతో పాటు దర్శకులు బాబీ, రాహుల్ రవీంద్రన్, కౌశిక్, రామ్‌జగదీశ్, నందకిశోర్ కూడా మాట్లాడారు.

'కింగ్ 100'లో

మహంతి ఝాన్సీరాణిగా

అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.('కింగ్ 100' పేరుతో రానున్న ఈచిత్రాన్ని అన్నపూర్ణా స్టూడియోస్ పతాకంపై రా కార్తీక్ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న సినిమా విడుదల కానున్నది. ఈ సినిమాలో టబు ఓ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం ఆమె పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఇందులో ఆమె పోషిస్తున్న మహంతి ఝాన్సీరాణి పాత్రను పరిచయం చేస్తూ ఓ ప్రత్యేక గ్లింప్స్‌ని విడుదల చేశారు.ఒటబు పవర్‌ఫుల్ వాయిస్‌ఓవర్‌తో ఈ గ్లింప్స్ సాగింది. 'ప్రపంచంలో రెండు రకాల మనుషులుంటారు.. లక్‌ను నమ్మేవాళ్లు ఒకరు.. హార్డ్ వర్క్‌ని నమ్మేవాళ్లు మరొకరు. ఐ షేట్ లక్' అనే డైలాగ్‌తో ఆమె పాత్ర పోకడను ఈ గ్లింప్స్ ఆవిష్కరించింది. భారీ జనసమూహం ముందు టబు ఎంట్రీ ఇవ్వడం, ప్రజలకు అభివాదం చేస్తూ ప్రమాణస్వీకారం చేయడం.. ఈ సన్నివేశాలతో గ్లింప్స్ క్యూరియాసిటీని పెంచింది. చీరకట్టులో ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఈ గ్లింప్స్‌లో టబు కనిపించారు. అత్యంత పవర్‌ఫుల్ కథ, కథనాలతో రా కార్తీక్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజా మహదేవన్, సంగీతం: దేవిశ్రీప్రసాద్.

Printed, Published, Owned and Edited by BERI LINGASWAMY, Printed at BERI PRINTERS, H.No: 1-2, Village : Cholledu, Mo: Munugode, Dist : Nalgonda, Pin: 508255, Telangana State.
Published at BERI PUBLICATIONS, H.No: 1-2, Village : Cholledu, Mo: Munugode, Dist : Nalgonda, Pin: 508255, Telangana State. Editor: BERI LINGASWAMY, RNI No: TELTEL/2019/78730 Cell: 9441665588